



సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నాహాలు

ఎన్నో ఏళ్లు తరువాత కూటమి ప్రభుత్వం డీఎస్సీ-2025 నిర్వహించింది. శుక్రవారం రాత్రి మెరిట్ జాబితా ప్రభుత్వం విడుదల చేసింది. కాబోయే గురువులు ఎవరో ఇప్పటికే తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉండాలి. తక్కువ సమయం ఉండడంతో వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఎంపికైన అభ్యర్థులు తమ సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్ వివరాల మేరకు సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే.. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు విద్యార్హత, కుల, ఆదాయం, స్థానికత(నేటివిటీ), దివ్యాంగులైతే వారి అర్హత ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు) పరిశీలన ఉంటుంది. ఎంతో కష్టపడి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు ఏ ఒక్క సర్టిఫికెట్ చూపించకపోయినా చిక్కుల్లో పడడమే కాదు.. ఉద్యోగమే కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఉద్యోగానికి దరఖాస్తు చేసే సమయంలో ఏఏ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారో.. ఆ సర్టిఫికెట్లు పరిశీలనలో తప్పకుండా చూపించాలని కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

- రాయలసీమ వర్సిటీ, శ్రీరాఘవేంద్ర, శ్రీనివాస్ బీఎడ్ కళాశాలల్లో కేంద్రాలు
- 54 బృందాల ఏర్పాటు
- డీఎస్సీ అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి
- సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్ మేరకు పరిశీలనకు హాజరు కావాలి

కర్నూలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రం (సోషియల్ స్టడీస్), ఎస్జీటీ టీచర్లు, పీఈటీలు, టీజీటీ ఇంగ్లీష్.. ఇలా వివిధ సబ్జెక్టుల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ-2025 నిర్వహించింది. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఖాళీలు ఉండడంతో జిల్లా నుంచే కాకుండా నాన్ లోకల్ కేటగిరీలో ప్రతిభ చూపేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసి పరీక్షలు రాశారు. 53,787 మంది అభ్యర్థులు మెరిట్ జాబితా వచ్చింది. వీరిలో రిజర్వేషన్లు ప్రకారం ఒక్కో పోస్టుకు ఒకరిని చొప్పున 2,645 మంది రేపటి ఎంపికైన అభ్యర్థులు (సెలెక్టెడ్ లిస్ట్) జాబితాను ఆదివారం రాత్రి విడుదల చేసి అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు పంపుతున్నట్లు తెలిసింది. విద్యాశాఖ నుంచి మెసేజ్ మేరకు అభ్యర్థులు ఇంటిమేషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని.. మెసేజ్‌లో పేర్కొన్న తేదీ, సమయంలో సంబంధిత పరిశీలన కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

సర్టిఫికెట్ల పరిశీలనకు 54 బృందాలు

కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎస్జీటీ అభ్యర్థులకు, నన్నూరు సమీపంలో మారుతి ఎస్టేట్ శ్రీరాఘవేంద్ర బీఎడ్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) లాంగ్వేజ్ అభ్యర్థులకు, నన్నూరు సమీపంలో మారుతీ ఎస్టేట్-2లో ఉన్న శ్రీనివాస బీఎడ్ కళశాలలో స్కూల్ అసిస్టెంట్ నాన్-లాంగ్వేజ్ అభ్యర్థులకు పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేశారు. 54 బృందాలను ఎంపిక చేశారు. ఒక్కో బృందంలో మండల విద్యా అధికారి (ఎంఈవో), ప్రధానోపాధ్యాయుడు, డిప్యూటీ తహసీల్దారు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారు. ఆరు బృందాలను ఒక బ్లాక్‌గా విభజించి, ప్రతి బ్లాక్‌కు సాంఘిక సంక్షేమం, బీసీ, ఎస్టీ, సైనిక్ సంక్షేమ శాఖ ప్రతినిధులు కూడా ఉంటారు. దివ్యాంగుల అభ్యర్థులు వారి అంగవైకల్యం నిర్ధారణ కోసం మెడికల్ బోర్డుకు పంపుతారు. వినికిడి లోపం కలిగిన వారిని విశాఖ పంపించి ధ్రువీకరిస్తారని డీఈవో తెలిపారు. పరిశీలన కేంద్రాల్లో ఏర్పాట్లను ఆదివారం డీఈవో శ్యామ్యూల్‌పాల్ తనిఖీ చేశారు. పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేసిన వర్సిటీ క్యాంపస్‌లోకి అభ్యర్థితో పాటు సహాయకుడు ఒకరిని అనుమతిస్తారు. అవసరమైన తాగునీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.8లక్షలలోపు ఆదాయం ఉన్నట్లు ధ్రువీకరించే ఆదాయ ధ్రువపత్రంతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ప్రకారం ఆ తేదీన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాకపోతే వారి అభ్యర్థిత్వం రద్దు చేసి, ఆ తరువాత మెరిట్ ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలను పిలుస్తారు. నిర్లక్ష్యం చేస్తే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉండడంతో అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో నిర్దేశించిన తేదీన హాజరు కావాలని విద్యా శాఖ అధికారులు తెలిపారు.

ప్రతి రోజు సైక్లింగ్‌తో ఆరోగ్యం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యం, శారీరక దృఢత్వం వస్తుందని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సండే ఈజ్ సైక్లింగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు 'ఫిట్ ఇండియా' అనే కార్య క్రమంలో భాగంగా సైక్లింగ్ జిల్లావ్యాప్తంగా చేయాలని సూచించామన్నారు. మానసిక, ఉద్యోగ ఒత్తిడిని తగ్గించాలంటే పోలీసులు చాలా ఫిట్‌గా ఉండాలన్నారు. ప్రస్తుతం జీవన శైలిలో చాలా మందికి ఆరోగ్య సమస్యలు వస్తున్నా యని, వాటిని అధిగమించాలంటే ఇలాంటి వ్యాయామం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు.


జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సైకిల్‌పై వెళ్తున్న పోలీసులు

పసురపాడు వీహెచ్‌ఏ సస్పెన్షన్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా అవకతవకలకు పాల్పడిన సంఘటనలో గోస్పాడు మండలం పసురపాడు రైతుసేవాకేంద్రం విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్(వీహెచ్‌ఏ) శ్రీకాంత్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ నుంచి గోస్పాడు మండలం పసురపాడు ఆర్ఎస్‌కేకు పంపిన యూరియా అక్కడికి చేరుకోకుండానే మాయం అయిన సంఘటనపై వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు విచారణ చేపట్టారన్నారు. విచారణలో ఆర్ఎస్‌కేకు చేరకుండానే కొంతమంది రైతులకు అందజేసినట్లు రుజువు కావడం, అందుకు సంబంధించి ఆర్ఎస్‌కేలో రికార్డుబుక్‌లో నమోదు చేయకపోవడం వంటి నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీకాంత్‌రెడ్డిని సస్పెండ్ చేశామన్నారు. ఎవరైనా ఆర్ఎస్‌కేల్లో ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎప్పటికప్పుడు సక్రమంగా రికార్డులు మెయింటెనెన్స్ చేయాలని ఆదేశించారు.


వీహెచ్‌ఏ నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న వ్యవసాయధికారులు

29న కర్నూలుకు మంత్రులు

- ఉమ్మడి జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై వినతుల స్వీకరణ

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ నెల 29న కర్నూలుకు రానున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కర్నూలు నగరంలోని సునయన ఆడిటోరియంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి మంత్రులకు వినతులను అందజేయవచ్చని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, పరిష్కారం ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌కు ఉదయం 9.30గంటలకు అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఆన్‌లైన్‌లోనే అనుమతులు

- వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి
- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు ఇస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు కావాలంటే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం చెక్ పెట్టి పారదర్శక విధానంలో అనుమతులు జారీ విధానం తీసుకువచ్చిందన్నారు. ప్రజలు వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండిలా..

గణేశ్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి అందులో నూతన దరఖాస్తును క్లిక్ చేయాలి. సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయగా ఓటీపీ వస్తుంది. అది నమోదు చేశాక దరఖాస్తు పత్రం వస్తుంది. అందులో దరఖాస్తు దారుడి పేరు, ఫోన్ నంబర్, మెయిల్ అడ్రసు నమోదు చేయాలి. విగ్రహం ఏర్పాటుచేస్తున్న స్థలం, విగ్రహం, మండపం ఎత్తు, పోలీసు సబ్‌డివిజన్, పోలీసుస్టేషన్ పేరు ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు వారి ఫోన్ నెంబర్లు, విగ్రహాన్ని నిమజ్జనం చేసే తేదీ, సమయం ఏ వాహనంలో తరలిస్తారో, వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తుదారుడి ఫోన్‌నెంబర్‌కి ఓటీపీ వస్తుంది. పోలీసులు క్షేత్ర స్థాయికి వచ్చి పరిశీలిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లోనే అనుమతులు వస్తాయి. దరఖాస్తుదారుడి ఫోన్ నెంబర్ అనుమతి పత్రం (ఎన్‌వోసీ) క్యూఆర్ కోడ్ రూపంలో వస్తుంది. అది ప్రింట్ తీసి సంబంధిత విగ్రహాల వద్ద ఉండే విధంగా చూసుకోవాలి.

యూరియా అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఏఎస్పీ మందా జావళి
- ఎరువుల దుకాణాలు, గోదాముల ఆకస్మిక తనిఖీ

నంద్యాల టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎవరైనా యూరియాను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మందా జావళి హెచ్చరించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, పోలీసుల శాఖ ఆధ్వర్యంలో ఏకకాలంలో ఎరువుల దుకాణాలు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నంద్యాలలో ఏఎస్పీ మందా జావళి, సీఐలు కంబగిరిరాముడు, ఈశ్వరయ్యతో కలిసి పట్టణంలోని దుకాణాలను, యూరియా నిల్వలను పరిశీలించారు. సరియైన పత్రాలు ఉన్నాయా, లేవా అనుమతులు గురించి అడిగి తెలిసుకున్నారు. ఎక్కవ కూడా అక్రమంగా యూరియాను తరలించరాదన్నారు. రిజిస్టర్లు, నిల్వలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా అక్రమంగా ఎరువులు తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.


గోదాములను పరిశీలిస్తున్న ఏఎస్పీ, వ్యవసాయాధికారులు

అధ్యక్ష పీఠం ఎవరికో?

- టీడీపీ జిల్లా అధ్యక్షుడి పదవి కోసం కసరత్తు
- ఆశావహుల్లో ఉత్కంఠ
- రేపు జిల్లాకు రానున్న ముగ్గురు సభ్యుల బృందం
- హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు
- అభిప్రాయాలు సేకరిస్తున్న పార్టీ అధిష్ఠానం





నంద్యాల, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నంద్యాల పార్లమెంట్ టీడీపీ నూతన అధ్యక్షుడు పీఠం కోసం కసరత్తు మొదలైంది. ఈనేపథ్యంలో పలు రకాలుగా అన్ని సమీకరణలను పరిగణలోకి తీసుకుని త్వరలోనే పార్టీ అధిష్ఠానం నియమించనుంది. ఈ క్రమంలో జిల్లాలోని నాయకుల నుంచి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ముగ్గురు సభ్యులు జిల్లా పరిశీలకులుగా మంగళవారం జిల్లాకు రానున్నారు. మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని, ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఛైర్మన్, రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పూల నాగరాజు సైతం జిల్లా నాయకులతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఎవరి పేరు తెరపైకి వస్తుందో?

మిగతా 8వ పేజీలో


మాజీ మంత్రి శిల్పా నిర్మించిన కల్యాణ మండపం

శిల్పాకు ఝలక్..!

- అక్రమంగా నిర్మించిన కల్యాణ మండపం
- 15 ఏళ్ల తర్వాత స్వాధీనం చేసుకున్న దేవదాయ శాఖ
- త్వరలో ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా కేటాయింపు

నంద్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డికి దేవదాయశాఖ అధికారులు ఒక్కసారిగా ఝులక్ ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మండపం ఆశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2008లో కాంగ్రెస్ ఎమ్మెల్యే శిల్పా మోహన్‌రెడ్డి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నంద్యాల పట్టణంలోని ప్రథమనంది ఆలయం ప్రాంగణంలో 60 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభించారు. 2009లో గృహ నిర్మాణశాఖ మంత్రి కాగానే పలువురు మంత్రులతో కలిసి సదరు మండపాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. పైగా వైఎస్సార్ కల్యాణ మండపంగా పేరు పెట్టడంతో పాటు నిర్మాణ దాతగా సదరు మంత్రి పేరు పెట్టుకోవడం అప్పట్లో విమర్శలకు దారి తీసింది.

ఒక్కపైసా కూడా చెల్లించలేదు

సదరు కల్యాణ మండపాన్ని 15ఏళ్లుగా వివాహాలు, వేడుకలు, సభలు, సమావేశాలకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకున్నారు. ఒక్క పైసా కూడా అటు దేవదాయ శాఖకు కానీ, ప్రథమనంది ఆలయానికి కానీ చెల్లించలేదు. ఈ నేపథ్యంలో 2019లో ప్రథమనంది ఆలయ ఛైర్మన్ అరవింద్‌ప్రసాద్ ఈవ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది. శిల్పా రాజకీయ పలుకుబడి ముందు ఆ శాఖ అధికారులు ఏమీ చేయలేకపోయారనే ఆరోపణలు లేకపోలేదు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అరవింద్ ప్రసాద్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అనంతరం కోర్టు కేసును విరమించుకోవడంలో కథ మొదటికి వచ్చినట్లైంది. ఆ తర్వాత దేవదాయశాఖ అధికారులు సదరు మండపాన్ని తమకు అప్పగించాలని పలుమార్లు శిల్పా కుటుంబాన్ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. కానీ వారు గుట్టుగా కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా ముందుగా అద్దె చెల్లించాల్సిందేనని ఈ ఏడాది ఏప్రిల్‌లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నెలకు రూ.25వేలు అద్దె, ఫ్లవర్ డెకరేషన్ తదితర సామగ్రి కోసం వేలం నిర్వహిస్తామని ఆశాఖ అధికారులు తేల్చి చెప్పారు. దీనికి శిల్పా కుటుంబం అంగీకరించలేదు. కేవలం రూ.10వేలు మాత్రమే అద్దె రూపంలో చెల్లిస్తామని.. మిగిలిన వాటిని తమకే అప్పగించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువురు మధ్య సమస్య కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో చేసేదీ లేక.. ఆశాఖ అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. శిల్పా కుటుంబం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ప్రతి పైసా పారదర్శకంగా నమోదు చేస్తాం

సదరు కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకోవడం వాస్తవమే. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం త్వరలో టెండర్లు పిలిచి కేటాయిస్తాం. దేవదాయశాఖతో పాటు ఆలయానికి ఆదాయం పెరగనుంది. గతంలో ఇలాంటి వాటికి ఎలాంటి లెక్కలు లేవు. ఇక నుంచి ప్రతి పైసా పారదర్శకంగా నమోదు చేస్తాం.

- రామానుజం, ఈవో, ప్రథమనంది ఆలయం



జిల్లాలో చర్చనీయాంశంగా మారింది

దేవదాయశాఖ డీసీ మోహన్, ఆలయ ఈవో రామానుజంతో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి శనివారం సదరు ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. నిబంధనలు ప్రకారం శిల్పా కుటుంబం నుంచి సదరు కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పైగా సమగ్ర నివేదికను ఆశాఖ కమిషనర్‌కు పంపించినట్లు తెలిసింది. త్వరలో సదరు కల్యాణ మండపంతో పాటు డేకరేషన్, షామీనా, సప్లయర్స్ తదితర వాటికి ప్రవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా కేటాయించే యోచనలో ఆశాఖ అధికారులు నిమగ్నమైనట్లు తెలిసింది. ఆయితే.. సదరు కల్యాణ మండపంకు ప్రథమనంది దేవాస్థాన కల్యాణ మండపంగా నామకరణం చేయనున్నట్లు సమాచారం. నిర్మాణదాతగా మాత్రమే శిల్పా పేరు ఉండే అవకాశం ఉందని సమాచారం. ఏది ఏమైనా సదరు కల్యాణ మండపాన్ని 15ఏళ్ల తరువాత ఆశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడం చూస్తే.. సదరు మండపం రూపంలో శిల్పా అక్రమాలకు ఝులక్ ఇచ్చినట్లైందనే జిల్లాలో జోరుగా ప్రచారం ఊపందుకుంది.



ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు బోర్డు ఏర్పాటు



నేత్రదానం చూపు ప్రదానం

నేత్రదానం అంటే మరణించిన తర్వాత మరొకరికి కంటిచూపును అందించడం . సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఇంతటి ముఖ్యమైన కంటి చూపునకు నోచుకోక చీకట్లోనే గడుపుతున్న వారెందరో? ప్రతి ఒక్కరూ మరణానంతరం తమ కళ్లను అలాంటి వారికిదానం చేయగలిగితే చూపు ప్రసాదించడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. వైద్యరంగంలో సాంకేతిక విప్లవం కారణంగా కార్నియా లోపంతో ఉన్న అంధులకు కంటి దానం ద్వారా మళ్లీ చూపు ఇవ్వడం సాధ్యమవుతుంది. చాలా మందికి సరైన అవగాహన లేక నేత్రదానం చేయడానికి ముందుకు రావడం లేదు. విద్యాధికులు, స్వచ్ఛంద సంస్థలు నేత్రదానంపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది. నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేత్రదానానికి అర్హులు: ఏవయస్సు వారైనా నేత్రదానం చేయవచ్చు. కళ్లజోడు పెట్టుకునేవారు. మధుమేహం, బీపీ, ఉబ్బసం వ్యాధులతో ఉన్న వారు.

నేత్రదానానికి అనర్హులు: కుక్క కాటు రేబిస్ వ్యాధితో చనిపోయిన వారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో చనిపోయినవారు. రెండు వారాలు వెంటిలేటర్‌పై ఉన్న వారు. క్యాన్సర్ వ్యాధితో ఎక్కువ కాలం స్పృహ లేకుండా ఉన్నవారు.

నేత్రాల సేకరణ ఇలా.. మరణించిన ఆరు గంటల లోపు నేత్రాలను తీయాల్సి ఉంటుంది. నేత్రదానం వలన కుటుంబ సభ్యులకు ఎటువంటి చార్జీలు ఉండవు. ఈ నేత్రాలను ఉచితంగా వైద్యుల బృందం వెళ్లి వారి దగ్గరనే సేకరిస్తారు. నేత్రదానం చేసిన వ్యక్తి నుంచి రక్త పరీక్షకు గానూ, 10మిలీలీటర్ల రక్తాన్ని తీస్తారు. శిక్షణ పొందిన టెక్నీషియన్లు స్టెరైల్ పద్ధతి ద్వారా కళ్లను బయటకు తీస్తారు. ఒక వ్యక్తి నేత్రాలను దానం చేయడంతో మరో ఇద్దరికి కంటి చూపు లభిస్తుంది.

- ఏటా 400 మందికి పైగా నేత్రదానం
- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- నేత్రదానంతో ఎందరో జీవితాల్లో వెలుగులు
- ఎవరైనా చనిపోతే ఆరు గంటల లోపు కళ్లు సేకరించాలి
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



ప్రభుత్వ ప్రాంతీయ కంటి వైద్యశాల

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో కంటికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. మరణానంతరం చేసే నేత్రదానంతో చూపులేని వారికి చూపునివ్వొచ్చు. నేత్రదానం చేసే వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా కేంద్ర ప్రభుత్వం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నిర్వహిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 2015 నుంచి నేత్రదానం ప్రారంభమైంది. అంధత్వ నివారణ సంస్థ గణాంకాల ప్రకారం ఏటా 400మందికి పైగా కళ్లను దానం చేయడానికి ముందుకొస్తున్నారు. కరోనా సమయంలో కార్నియా సేకరణ కొంత కుంటుబడిన ఆ తర్వాత మళ్లీ పుంజుకుంది. కర్నూలు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ లెక్కల ప్రకారం 2022-2023లో 412, 2023-24లో 488, 2024-2025లో ఇప్పటి వరకు 352 నేత్రాలను కౌన్సిలర్ ద్వారా సేకరించారు.

నాలుగు హాస్పిటల్‌కు అనుమతి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రాంతీయ కంటి ఆసుపత్రి కర్నూలు, శాంతిరాం నంద్యాల, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీలకు కార్నియాను సేకరించే అనుమతులు ప్రభుత్వం ఇచ్చింది. ఇటీవల కర్నూలు సుశీల నేత్రాలయానికి కార్నియా ఐ డొనేషన్‌కు అనుమతి లభించింది. కర్నూలు ఆర్‌ఈహెచ్, నంద్యాల శాంతిరాం హాస్పిటల్, కర్నూలు రెడ్‌క్రాస్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు(హైదరాబాదు) సహకారంతో కార్నియాను సేకరిస్తుంది. సుశీల నేత్రాలయ సికింద్రాబాద్ వాసన్ ఐ బ్యాంకుకు పంపిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు మోటివేటర్స్‌గా పని చేస్తూ అవగాహన కల్పిస్తూ నేత్రదానం చేసే వారి సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు.

కార్నియా మార్పిడిలో సక్సెస్ రేట్ ఎక్కువ



శరీరంలోని అవయవాల మార్పిడి అన్నింటిలో కంటే కార్నియా మార్పిడిలో 90 శాతం సక్సెస్ రేట్ ఉంటుంది. ఒక వ్యక్తి కళ్లను దానం చేస్తే నలుగురికి చూపు ప్రసాదించొచ్చు. ఈ నెల 16న సుశీల నేత్రాలయంకు కార్నియా సేకరణ సెంటర్‌కు కలెక్టర్ నుంచి అనుమతి లభించింది. ఇప్పటి వరకు కర్నూలు, బేతంచెర్లలో ఇద్దరి నుంచి నేత్రాలను సేకరించాం.

● డాక్టర్ పి.రాఘవ్ ప్రీతమ్, కార్నియా స్పెషలిస్టు, సుశీల నేత్రాలయ, కర్నూలు

అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం



నేత్రదానంపై ప్రజల్లో, విద్యాసంస్థలు, విద్యార్థుల్లో ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నాం. నేత్రదానం ద్వారా కార్నియా పొందిన వ్యక్తి పేరు ఎల్లప్పుడు రహస్యంగా ఉంచుతాం. నేత్రదానంపై ప్రజల్లో అపోహలున్నాయి. ప్రజల్లో కూడా చైతన్యం కలిగించి వారిలో అవగాహనను కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేత్రదానానికి ముందుకు వస్తే 9849903116 నంబరును సంప్రదించాలి.

● డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, కర్నూలు

అందరూ ముందుకు రావాలి



నేత్రదానానికి అందరూ ముందుకు రావాలి. మరణించిన వ్యక్తి 4-6 గంటలలోపు నేత్రాదానం చేయాలి. గతంలో నల్లగుడ్డు పూర్తి భాగం అందుబాటులోనికి రావడంతో కార్నియాలో కొంత భాగం మాత్రమే మార్పిడి చేసేవారు. దీని లామెల్లార్ కరటోప్లాస్టి అంటారు. నల్లగుడ్డు మొత్తం దెబ్బతింటే దాత ఇచ్చిన కార్నియా ద్వారా కంటి చూపును ప్రసాదించొచ్చు.

- డాక్టర్ ఎస్.మున్నీర్ బేగం, కార్నియా స్పెషలిస్టు, అమీలియో హాస్పిటల్, కర్నూలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రజక విద్యాసమితి ఆధ్వర్యంలో 7వ రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్యే దువ్వూరు రామారావు, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి హాజరయ్యారు. పది, ఇంటర్, డిగ్రీల్లో ఉత్తమ మార్కులు సాధించిన 92 మంది విద్యార్థులకు మెడల్స్‌తో పాటు రూ.2వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ చదువు ద్వారానే సంఘంలో మర్యాద, హోదా దక్కుతుందని, ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, రజక విద్యాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వెంకటేశ్, జిల్లా రజక సంక్షేమ సంఘం నాయకుడు బస్తిపాటి మౌలాలి, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేష్, మధుసూదన్‌రావు, దోబి మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు జిల్లెల, శ్రీరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నల్లమలలో గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వంట చెరుకు సేకరణ కోసం వెళ్లిన గిరిజనుడు నరసింహులుపై ఆదివారం ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాజులపల్లి ఆర్ఎస్ చెంచుగూడేనికి చెందిన నరసింహులు నల్లమల అటవీ ప్రాంతంలోని చలమరేంజ్ పరిధిలోని సున్నంబట్టి ప్రాంతంలో వంట చెరుకు సేకరణ చేస్తుండగా ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కోడుమూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులు చెన్నయ్య, నాగేష్, స్వర్ణలత, తులసివేణి, ప్రభావతి, షాలుబాషాను ఆహ్వానించి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతికి కృషి చేసిన గురువుల పాదాలకు నమస్కరించారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠ శాల అభివృద్ధికి చేయూతనందిస్తామని కొందరు పూర్వవిద్యార్థులు ముందుకువచ్చారు. వారు మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కుంపటి కృష్ణయ్య, హుస్సేన్, మాబు బాషా, చైతన్యకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ఓర్వకల్లు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈఘటనలో నన్నూరు గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను హైదరాబాదు నుంచి తిరుపతి వెళ్తున్న మోక్ష ట్రావెల్స్ బస్సు ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు, ట్రాక్టర్ ముందు భాగాన నుజ్జునుజ్జయ్యాయి. స్వల్ప గాయాలైన ప్రయాణికులకు ప్రథమ చికిత్స చేయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు, టోల్‌గేటు సిబ్బంది చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బార్లకు బోణీ

- ఆదోనిలో ఐదు దరఖాస్తులు
- ఊపిరి పీల్చుకున్న ఎక్సైజ్ శాఖ
- మిగిలింది రెండు రోజులే

కర్నూలు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బార్లకు సంబంధించి ఎట్టకేటలకు బోణీ అయ్యింది. ఆదోని పట్టణంలోని రెండు బార్లకు ఐదు దరఖాస్తులు వేశారు. ఈనెల 18వ తేదీని 26 బార్లకు నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దరఖాస్తులు వేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ సతమతమైంది. ఆదివారం ఒక్కసారిగా 32 మంది దరఖాస్తులు వేసేందుకు ఆన్‌లైన్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. ఈనెల 26వ తేదీ చివరి రోజు కావడంతో చివరి రెండు రోజులు కీలకంగా మారాయి. మొదట ఎవరూ దరఖాస్తులు చేయకూడదనే నిర్ణయానికి వచ్చిన బార్ల యాజమాన్యాలు ఒక్కొక్కరుగా దరఖాస్తులు వేసేందుకు సిద్ధమతున్నారు. ఆదోని-11, ఎమ్మిగనూరు-1, కర్నూలు-22 మంది ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. గడువులోపు దరఖాస్తు రుసుం చెల్లించి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను పూర్తిచేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ శాఖ ఊపిరి పీల్చుకుంది. రెండు రోజుల్లో బార్లకు పూర్తి స్థాయిలో దరఖాస్తులు ప్రక్రియకు స్పందన ఉండే అవకాశం ఉందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు తెలిపారు. ఇప్పటికే ప్రక్రియకు సంబంధించిన పలు రకాల సందేహాలను కార్యాలయానికి వచ్చి సంప్రదించే తీరును బట్టి భారీ ఎత్తున స్పందన ఉండే పరిస్థితి ఉందని తెలిపారు.

క్వాంటమ్ సాంకేతికతతోనే అభివృద్ధి

- ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



క్వాంటమ్ ఒప్పంద సంతకాలతో ఆర్‌యూ వీసీ, రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ సాంకేతికతతోనే అభివృద్ధి సాధ్యమని ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు అన్నారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో తన చాంబర్లో క్విన్‌సెనిస్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపకులు సీవో చీఫ్ సైంటిస్టు డాక్టర్ వల్లూరు మహేశ్వరరావు రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుతో కలిసి ఎంవోయూలో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఇకపై క్వాంటమ్ భాగస్వామ్యంతో పరిశోధనలు, ఆవిష్కరణలతో వర్సిటీ అవగాహన ఒప్పదం కుదుర్చుకుందని తెలిపారు. పరిశోధన, అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, ఆవిష్కరణ సహకారం, సంయుక్త కార్యక్రమాలు వంటి విభాగాల్లో కలిసి పనిచేయడంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీన్ వెంకట సుందరానంద పుచ్చా, సి.విశ్వనాథరెడ్డి, ప్రొఫెసర్లు, విదార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి సీఎం కృషి

- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



గిరిజన సలహామండలి సభ్యులు వెంకటపతితో పాటు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, దస్తగిరిని సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అధ్యక్షతన గిరిజన సలహా మండలి సభ్యుడు వెంకటపతిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కేఈ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం దళితుల, గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆశీస్సులతో సీఎం చంద్రబాబు నాయుడు తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివరారెడ్డి, రామనాయుడు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బత్తిన లోక్‌నాథ్, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామ్‌రాజ్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌తోపాటు గిరిజన ఉద్యోగ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అరికడతాం

- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ● 70 బైకులు స్వాధీనం

నంద్యాల టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్డన్ సెర్చ్‌తో నేరాలను అరికడతామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఆదివారం ఉదయం పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించాలని కార్డెన్ సర్చ్ నిర్వహించామన్నారు. కార్డన్ సర్చ్‌లో సరియైన పత్రాలు లేని 70 బైకులు, 50 మద్యం బాటిళ్లు, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

చట్ట వ్యతిరేక కార్యకల పాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా మెలిగి నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచా మన్నారు. ఎవరైనా ఎక్కువ సార్లు నేరాలకు పాల్పడితే వారిపై కూడా రౌడీ షీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని వాడుకోవడంలో వారు ముందున్నారు. గూగుల్ మ్యాప్‌ను ఆధారంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లడమే లక్ష్యంగా సాగారు. వీటిని మహారాష్ట్రకు తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న దొంగల ముఠా ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. ఆదివారం పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఓ కుగ్రామానికి చెందిన ముగ్గురు దొంగలు ఎత్తిపోతల పథకాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటివద్ద ఎన్ని మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి? వాటి వద్దకు ఎలా వెళ్లాలి? అనే వివరాలను గూగుల్ మ్యాప్‌లో సేకరిస్తారు. ముందుగా టార్గెట్ చేసిన ప్రాజెక్టు సమీప పట్టణానికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తారు. ప్రాజెక్టు వద్ద 10రోజుల పాటు రెక్కీ నిర్వహిస్తారు. ఆతర్వాత ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని కాపర్‌ను దొంగలిస్తారు. వాటిని తరలించేందుకు మహారాష్ట్ర నుంచే వాహనాన్ని తెప్పించుకుంటారు. ఈ ముఠా అక్కడికి తీసుకెళ్లి అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఈఏడాది మార్చి 10వ తేదీన నాగటూరు సమీపంలోని మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ దొంగతనానికి గురైంది. ఈఅంశంపై ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫిర్యాదు చేసుకున్న పోలీసులు విచారణకు దిగారు. సంఘటన స్థలం వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పట్టణంలో ఆయా తేదీల్లో లాడ్జీల్లో ఎవరెవరు ఉన్నారన్న వివరాలను తెలుసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రాజేంద్ర బబన్ బోలే పేరు మీద రూం బుక్కు అయ్యింది. అక్కడ ఉన్న ఫోన్‌నెంబర్ ఆధారంగా నింది తులు ఉన్న గ్రామాన్ని పోలీసులు గుర్తించారు. నిందితుల కోసం అక్కడికి వెళ్లి గాలింపు చేపట్టారు. ప్రధాన నిందుతుడు రాజేంద్ర బబన్ బోలేతో పాటు మరో ఇద్దరు నాందేవ్ బిలాస్ సటపుటే, సంజయ్ లక్ష్మణ్ హర్ గావోకర్‌ను కూడా ఈకేసులో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ. లక్ష నగదు, ఒక బైక్, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం నందికొట్కూరు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాపర్‌ను అమ్మిన నగదును పూర్తిస్థాయిలో రికవరీ చేసేందుకు ఏ1 నిందితుడైన రాజేంద్ర బబన్ బోలెను పోలీసు కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరినట్లు ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంతో సహకరించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందిస్తూ.. నగదు బహుమతిని అందజేశారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం



పాణ్యం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శిగా పాణ్యం ఎంఈఓ- 2 సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా శ్రీనివాస యాదవ్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కిరణ్ కుమార్‌రెడ్డి, కోశాధికారిగా గోవింద రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ అధ్యక్షులను, కార్యదర్శులను, ముగ్గురు రాష్ట్ర కౌన్సిలర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఈఓలు శంకరప్రసాద్, వెంకటరామిరెడ్డి, రామసుబ్బయ్య, సురేంద్రనాథ్, నరసింహులు, శివరాం ప్రసాద్, 60 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం సీతారామపురం మెట్ట రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆదివారం గాజులపల్లి నుంచి నంద్యాలకు వెళ్తున్న ఆటో మండలం లోని సీతారామపురం మెట్టకు ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో రహదారి పక్కన ఆటో డ్రైవర్ నిలబెట్టాడు. ఆ సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ప్రమాదవశాత్తు ఆటోను ఢీకొనడంతో బోల్తా పడింది. అయితే పెద్ద ప్రమాదం తప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మహానంది పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా రాణించాలి

పాణ్యం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాపార వేత్తలుగా రాణించాలని, స్పార్క్‌ట్యాంక్ వేదికగా మారిందని హెచ్‌ఓడీ భాస్కరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆర్జీఎం కళాశాలలో ఏర్పాటు చేసిన స్పార్క్‌ట్యాంక్ బిజినెస్ పిచింగ్ కార్యక్రమంలో అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి నవనీత, ఉపయోగిత, మార్కెట్ సామర్థ్యం, ప్రదర్శన నాణ్యత ఆధారంగా మూడు బృందాలను విజేతలుగా ప్రకటించి నగదు బహుమతి అందజేశారు. వీరు యురేకా పోటీలో కళాశాల తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అధ్యాపకులు గోపికృష్ణారావు, సయ్యద్ అల్తాఫ్ హుసేన్, లెనిన్, రంగస్వామి, వెంకటేశ్వర్లు, ఫణీశ్వర హరగోపాల్, ముర్తుజా, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

నంద్యాల రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి సరిపడా అందజేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. నంద్యాలలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు వస్తున్న అరకొర యూరియాను స్థానిక టీడీపీ నాయకులు పక్కదారి పట్టిస్తున్నా సంబంధిత అధికారులు, కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. 2024 ఖరీఫ్‌లో సాగుచేసిన పొగాకు ఇప్పటికీ అమ్ముడుపోకపోయినా ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా నంద్యాలలో ఒక్క పొగాకు కొనుగోలు కేంద్రం కూడా లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. పాణ్యం మండలం పిన్నాపురంలో 8600 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇప్పటికే 2500 ఎకరాలు గ్రీన్‌కో కంపెనీకి ఇచ్చారన్నారు. ఇలాగైతే వ్యవసాయ భూములు ఉండవని ప్రస్తుతం కంపెనీకి భూమి ఇవ్వాలనుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గాజులపల్లిలోని ఎరువుల దుకాణాలపై ఆదివారం సాయంత్రం ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా దీప్తి ఫెర్టిలైజర్ దుకాణంలో 131 డీఏపీ బస్తాలను సీజ్ చేశారు. కాగా ఇటీవల యూరియాకు మంచి డిమాండ్ ఉండటంతో దుకాణాదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నా రన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు చర్చ జరుగు తోంది. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డిని వివరణ కోరగా తనకు విజిలెన్స్ దాడులపై ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు.

బీసీలకు పెద్దపీట వేసిన ఘనత టీడీపీదే

- పాములపాడు, వేంపెంట చైర్మన్ల ప్రమాణ స్వీకారం
- టీడీపీతోనే రైతులకు సంక్షేమం : మాండ్ర
- వైసీపీ అసత్య, విషప్రచారాలను సహించేది లేదు: ఎమ్మెల్యే

పాములపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు చట్టసభల్లో అధికశాతం రిజర్వేషన్లు కల్పించి వారికి సముచిత స్థానాన్ని కేటాయించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం పాములపాడు ఆంధ్రప్రగతి సహకార సంఘం చైర్మన్‌గా రాయ పాటి గోవిందు, వేంపెంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడి గా లక్ష్మీకాంతరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాండ్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఇస్కాల లిఫ్ట్, మల్యాల ఎత్తి పోతల పథకాలు ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించామ న్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనమైందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ హామీలు సూపర్ హిట్ కావడంతో ఓర్వలేని వైసీపీ నాయకులు విష ప్రచారాలకు తెరలేపారని, గట్టిగా బదులిస్తామని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనానాథ్‌డ్డి, తిమ్మారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, హరినాథరెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, పూసల క్రిష్ణ, సురేశ్, జనార్ధన్, రామక్రిష్ణ, నాగార్జునరెడ్డి, చంద్రశేఖర్, నాగలక్ష్మీరెడ్డి, ఆదిరెడ్డి, మోహన్‌గౌడ్, బాలస్వామి, రమణారెడ్డి, గంటారమేశ్, రఘు, హరిప్రసాద్, న్యాయవాది బతుకులయ్య, గజ్జల భాస్కరరెడ్డి, రాముచౌదరి, మల్లీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాములపాడులో సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


వేంపెంటలో సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్, రైతు సంఘం నాయకులు సుధాకర్, మాబాషా పేర్కొన్నారు. ఆదివారం వారు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులు మారుబోతుల విజయ్‌కుమార్, గోపాల్ రెడ్డి, భాస్కరరెడ్డి, ఉప్పరి విజయకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహెబూబ్ బాషా, ముర్తుజా రైతులు ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ రాము హెచ్చరించారు. ఆదివారం కొట్టాలచెరువు గ్రామం లో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఆ గ్రామంలో సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్మికుల శ్రమను దోచిపెట్టడం తగదు


సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడం పాలకులకు తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ మూడో మహాసభ ఎస్.ఉస్మాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి శ్రమ దోపిడీ చేసి పాలక ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్, కొంగర వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ కార్యదర్శి దూదేకుల బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ పట్టణ నూతన కమిటీ ఏర్పాటు

సీఐటీయూ పట్టణ అధ్యక్షుడిగా ఉస్మాన్ బాషా, ప్రధాన కార్యదర్శిగా గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా అంగన్వాడీ మదర్‌బీ, మద్దిలేటి, సహాయ కార్యదర్శులుగా మున్సిపాల్టీ పరమేష్, బోయ పాండు, బసవరాజు, ఆశా వర్కర్స్ నజరున్నీసా తదితరులతో కూడిన మొత్తం 35 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహానంది గోపురాలపై పిచ్చిమొక్కల తొలగింపు

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని పురాతన గోపురాలపై పెరిగిన పిచ్చిమొక్కలను ఆదివారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి, పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి సిబ్బందిని గోపురాలపైకి ఎక్కించి పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షాకాలం కావడంతో గోపురాలపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో తొలగించామని పేర్కొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం


వంగాల వెంకట కృష్ణారెడ్డి


నజీర్ అహ్మద్

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా వెలుగోడు మండలంలోని రేగడగూడూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వంగాల వెంకటకృష్ణారెడ్డి, అలాగే మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా బీ.నజీర్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆత్మకూరులోని మార్కెట్ యార్డు ప్రాంగణం లో ఉదయం 11గంటలకు పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు సింగిల్ విండో సొసైటీ పాలక మండలి ప్రమాణ స్వీకారం

ది ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నూతన పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉదయం 11గంటలకు జరిగే ఈ ప్రమాణ స్వీకార కార్య క్రమంలో సొసైటీ చైర్మన్‌గా ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటకు చెందిన టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకులు షాబుద్దిన్‌తో పాటు సభ్యులుగా అమరం రమేష్ (నల్లకాల్వ) ప్రవీణ్ కుమార్(వెంకటాపురం) బాధ్యతలను స్వీకరించనున్నారు.

పాఠశాలకు విరాళం

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థి తిమ్మాపురానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసులు రూ.5 వేల విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డికి ఆదివారం అందజేశారు.

జేవీవీ జిల్లా కమిటీ ఏర్పాటు


మాట్లాడుతున్న న్యాయవాది రామచంద్ర రావు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా జనవిజ్ఞాన వేదిక నూతన కమిటీని ఆదివారం జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. సన్‌రైజ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన 18వ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా న్యాయవాది రామచంద్ర రావు, డాక్టర్ కృష్ణచైతన్య, న్యూక్లియస్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడిగా రామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా రామరాజు, లతీఫ్, మరియదాసు, సర్వజ్ఞమూర్తి, కార్యదర్శులుగా చిన్నయ్య, పునీత్, జయకర్, మాణిక్యంశెట్టి, గురుస్వామి, నలుగురు కమిటీ సభ్యులను ఎంపికచేశారు.

ఉపాధ్యాయుల ధర్నా వాయిదా

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 26న డీఈవో కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఫ్యాప్టో కార్యాలయంలో ఆదివారం జిల్లా నాయకులు శివయ్య, నగిరిశ్రీనివాసులు, లక్ష్మణ్‌నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోతో జరిగిన చర్చలకు సానుకూలత రావడంతో ఈనెల 26న తలపెట్టిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉపా ధ్యాయుల సమస్యలు పరిష్కారం లభించకపోతే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆందోళనను చేపడుతామన్నారు. గోపాలకృష్ణయ్య, రామమోహన్, సాంబశివుడు, రామచంద్రారెడ్డి, దస్తగిరి, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బండిఆత్మకూరు, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కోడూరు గ్రామంలో 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆదివారం గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. శేఖర్ ఇంట్లో 10 బాటిళ్లు, పుల్లయ్య ఇంట్లో 11 బాటిళ్లను స్వాధీన చేసుకున్నామన్నారు.

టీచర్లుగా దంపతులు


శ్రీనివాసులు


లక్ష్మీకళ

మహానంది,ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన పగడాల శ్రీని వాసులు, భార్య లక్ష్మీకళ డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అల్లీనగరం రెగ్యులర్, గాజులపల్లి సచివాలయం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తునే శ్రీనివాసులు డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యారు. అలాగే గృహిణిగా ఉన్న ఆయన సతీమణి లక్ష్మీకళ కూడా భర్తతో పాటు డీఎస్సీ కోచింగ్ తీసుకున్నారు. వీరు ఇటీవల వెలువడిన డీఎస్సీ 2025లో ప్రతిభ చూపి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు.

మహానందిలో క్లాక్ కౌంటర్ వద్ద ఘర్షణ

- భక్తురాలికి గాయాలు


ఘర్షణను అదుపు చేస్తున్న కానిస్టేబుల్

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో భక్తుల వస్తువులు భద్రపరిచే కౌంటర్ వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆదివారం మహానంది క్షేత్రానికి కర్ణాటక రాష్ట్రం నుంచి భక్త బృందం వచ్చింది. భక్తులు తమ సెల్‌ఫోన్లను ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద భద్రపరిచి దర్శనం కోసం లోపలికి వెళ్లారు. అయితే ఆలయంలో అనిత అనే భక్తురాలు సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీస్తుండగా సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద పనిచేసే సిబ్బంది సెల్‌ఫోన్ లాక్కుని కౌంటర్‌లో అప్పగించారు. భక్తులు సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరడంతో రూ.500 జరిమానా విధించాలని పేర్కొనడంతో వారి మధ్య గొడవ జరిగింది. భక్తురాలు అనితపై క్లాక్ కౌంటర్ సిబ్బంది కర్రతో దాడి చేయడంతో ఆమె చేతికి గాయాలయ్యాయి. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది ఆర్ఎస్ శ్రీనివాసులు, హోంగార్డు కోటయ్య అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పారు. వారు వినకపోవడంతో పోలీసులు శేషన్న, చంద్రశేఖర్, జనార్ధన్ అక్కడికి చేరుకొని భక్తులకు కౌంటర్ నిర్వాహకులతో క్షమాపణ చెప్పించడంతో వారు శాంతించారు.

అధ్యక్ష పీఠం ఎవరికో?

5వ పేజీ తరువాయి

అని అన్ని వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. నంద్యాల పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీల వాటిపై సమావేశంలో అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర కమిటికి అందించ నున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

ప్రస్తుత అధ్యక్షుడిపై ఆరోపణలు?

ప్రస్తుతం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్‌పై టీడీపీ వర్గాల్లో పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జిల్లాలో రెడ్డి సామాజిక వర్గం ఎక్కువ. ఎమ్మెల్యేలు కూడా ఈ సామాజికవర్గం వారే అధికం. ఈ నేపథ్యంలో ప్రస్తుత అధ్యక్షుడు బీసీ సామాజిక వర్గం కావడంతో అప్పట్లో టీడీపీ అధిష్ఠానం ఈయనకు అప్పగించింది. 2014-18లో వైసీపీ తరుపున జడ్పీటీసీగా గెలిచారు. టీడీపీ అధికారంలో ఉండటంతో పార్టీలో చేరి ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత కూటమి పాలనలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నియమించబడ్డారు. ఆయనది పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామం. కర్నూలు జిల్లాకు దగ్గరగా ఉంది. ఈయనకు టీడీపీ బోర్డు మెంబర్‌గా కూడా పార్టీ అవకాశం కల్పిం చింది. అయితే ఈయన అధ్యక్ష పదవి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నంద్యాలకు వచ్చిన దాఖలు తక్కువే అని ఆ పార్టీ వర్గాల్లో నెలకుంది. పైగా అధ్యక్షుడి స్థాయిలో ఒక్క సమావేశం కూడా విజయవంతం చేయలేదని పార్టీ నాయకుల్లో విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు కూడా ఈయనపై అసంతృప్తిగా ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో జిల్లా అధ్యక్షుడి ఎంపిక అభిప్రాయ సేకరణతో ఉత్కంఠ రేపుతోంది.

ఆశావహుల్లో ఉత్కంఠ

టీడీపీలో ఆధ్యక్ష పదవి డిమాండ్ కలిగిన పదవి. దీని కోసం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో పాటు డోన్‌కు చెందిన విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావు. నంద్యాల పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది రామచంద్రరావు కూడా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈయన గతంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. వీరితో పాటు ప్రస్తుత నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్య దర్శి మంత్రి కుమారుడైన ఎన్ఎండీ ఫిరోజ్ కూడా అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డి సైతం అధ్యక్ష పదవికోసం ప్రయత్నిస్తున్నారు. గోస్పాడు మండలం యాలూరుకి చెందిన టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుసేన్ కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా భూమా విఖ్యాత్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారని తెలిసింది.

ఎమ్మెల్యే, మంత్రులు, ఎంపీలు

జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీతో పాటు పలువురు ప్రధాన నాయకులు సైతం మంగళవారం జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష పదవితో పాటు పార్లమెంట్, అనుబంధ కమిటీల ఎంపికకు సంబంధించి అభిప్రాయ సేకరణ జరగనుంది.

ఐదుగురి మధ్యే పోటీ..

జిల్లా అధ్యక్ష పదవి కోసం జిల్లాలోని నలుగురు వ్యక్తుల మధ్య పోటీ ఎక్కువగా ఉందని ప్రచారం జిల్లాలో జోరందుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుసేన్, హైకోర్టు న్యాయవాది గోగుల నరసింహారావుల మధ్య పోటీ ఎక్కువగా ఉందని సమాచారం. వీరందరూ కూడా ఎవరి స్థాయిలో తమదైన శైలిలో అధ్యక్ష పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న ట్లు సమాచారం.

గోపుర కలశాలకు మండల పూజలు


కలశాలకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

ఉయ్యాలవాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ గోపుర కలశాలకు మండల పూజ చేశారు. ఆదివారం గ్రామస్థులు, ఆలయ అర్చకుడు అనంతశర్మ ఆధ్వర్యంలో కలశాలకు అభిషేకం , అలంకరణ చేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. ప్రతిష్ఠ ముగిసి 40 రోజులు అయినట్లు గ్రామస్థులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

- డీఎస్పీ ప్రమోద్ ● జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాల మైదానంలో జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. డీఎస్పీ పోటీలను ప్రారంభించారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న నంద్యాల జర్నలిస్టుల జట్టు 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేశారు. అనంతరం ఆళ్లగడ్డ జర్నలిస్టు జట్టు కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 78 పరుగులు చేసి విజయం సాధించింది. ప్రతిభ కనపరిచిన ఆళ్లగడ్డ జర్నలిస్టు జట్టును డీఎస్పీ ప్రమోద్ అభినందించారు.

జేవీవీ జిల్లా అధ్యక్షుడిగా రామ్మూర్తి


సభలో మాట్లాడుతున్న వక్త

డోన్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా రామ్మూర్తి ఎన్నిక య్యారు. ఆదివారం పట్టణంలోని సన్‌రైజ్ స్కూల్‌లో జేవీవీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 18వ జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభల సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్.అబ్దుల్ లతీఫ్, సర్వజ్ఞ మూర్తిని ఎన్నుకున్నారు. ఎన్నికల రాష్ట్ర పరిశీలకులుగా మురళిధర్ వ్యవహరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షుడు రమేష్ నాయుడు, సంజీవరాయుడు, చంద్రమోహన్, మధు అభినందనలు తెలిపారు.

రక్తదానం చేయాలి: ఎస్‌ఐ

బేతంచెర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బేతంచెర్ల ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో విశ్వబంధువు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓం శాంతి, లైఫ్ యువనేత్ర, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్‌ఐ రమేష్‌బాబు ప్రారంభించారు. స్వచ్ఛందంగా యువత, మహిళలు సుమారు 62 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త గౌరి హుశేన్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి, సురేంద్ర కుమార్, బ్రహ్మకుమారీస్ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

బేతంచెర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగర్ కాలనీ షాదీఖానాలో తాగునీటి బోరు వేయిచడంపై ఆదివారం బేతంచెర్ల ముస్లిం మైనార్టీ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోట్ల దంపతులకు సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జాకీరుల్లా బేగ్, రహిమతుల్లా, ఎంఎస్ జక్రియా, ఖాజా హుశేన్, సిద్దిక్ ఉన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

కొలిమిగుండ్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి జరిగింది. ఈ ఘటన మండలంలోని తిమ్మనాయినిపేట వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకున్నది. జమ్మలమడుగు డిపోకు చెందిన బస్సు కొలిమిగుండ్లకు వస్తూ తిమ్మనాయినిపేట బస్టాండు వద్ద ప్రయాణికులను దింపేందుకు ఆగింది. దాంతో దారిలో అడ్డంగా ఉందటంటూ నందిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి దుర్భాషలాడుతూ దాడి చేశాడు. దాంతో ఆర్టీసీ డ్రైవర్ కాలేబు కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి: సీఐ

కోవెలకుంట్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ సూచించారు. ఆదివారం పట్టణంలోని జగనన్న కాలనీలో కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు ఎస్‌ఐలు మల్లికార్జున రెడ్డి, రయణయ్య, భూపాలుడు , పోలీసు సిబ్బందితో కలిసి సీఐ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎవరైనా కొత్తవారు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

పెద్దకంబలూరు గ్రామంలో..

రుద్రవరం: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ దస్తగిరిబాబు తెలిపారు. ఆదివారం పెద్ద కంబలూరులో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. నంబర్ ప్లేట్లు, ఎలాంటి పత్రాలు లేని 11 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహ్మద్ రఫీ, ఎస్‌ఐలు భూపాల్‌రెడ్డి, బాలన్న సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సంజామల, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. పేరుసోమలలో వేణుగోపాలున్ని కొలువుదీర్చి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లె మాజీ సర్పంచ్ న రసింహా రెడ్డి, సురేష్, వెంకట రామి రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, పేరు సోమల కమిటీ అధ్యక్షుడు సురేష్, పెద్దయ్య, గ ణపతి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

డోన్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న కృష్ణమూర్తి అనే వ్యక్తి ఎలక్ట్రిక్ స్కూటర్ మంటలకు దగ్ధమైంది. ఆదివారం రాత్రి కృష్ణమూర్తి తన ఎలక్ట్రిక్ స్కూటిని చార్జింగ్ పెట్టి ఇంట్లో ఉండగా.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి స్కూటికి మంటలు చెలరేగాయి. మంటలు అధికంగా వ్యాపించడంతో స్కూటీ పక్కనే ఉన్న రెండు సైకిళ్లు, అలాగే టీవీ, ఫ్రిడ్జ్ కూడా కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న డోన్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పేశారు. అప్పటికే వాహనాలు అన్నీ కాలి బూడిదయ్యాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం


సమావేశానికి హాజరైన విశ్వహిందూ పరిషత్ సభ్యులు


డోన్ సీఐ ఇంతియాజ్ బాషాను ఆహ్వానిస్తున్న సభ్యులు

చాగలమర్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆళ్లగడ్డ నియోజకవర్గ విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల్లో స్వదేశీ నినాదంతో ముందుకెళ్లాలని అన్నారు. మట్టి వినాయక విగ్రహాలను కొలువుదీర్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. గణేశ్ మండపాల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో మండపాల నిర్వహణకు కమిటీ సభ్యులు సహకరించుకోవాలని అన్నారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పుల్లయ్య, నాగరాజు, విశ్వనాథం, కృష్ణమాచారి, చాగలమర్రి గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు, గంగుల భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలపై నేడు సమీక్ష

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట శ్రీరాముల దేవాలయంలో సోమవారం సాయంత్రం గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఉంటుందని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షులు కోట్రికే ఫణిరాజ్, కార్యదర్శి సందు వెంకటరమణ తెలిపారు. ఆదివారం డోన్ ఆర్‌డీవో కేవీ నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, సీఐ ఇంతియాజ్ బాషా, కమిషనర్ ప్రసాద్‌గౌడు, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, సంబంధిత శాఖల అధికారులను కలిసి సమావేశానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు గౌడు, ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయుడు, విశ్వహిందు పరిషత్ అధ్యక్షులు తిమ్మారెడ్డి, శ్రీరామ్, అంబికేశ్వర్, శేఖర్ రెడ్డి, ప్రసాద్ సముద్రాల పాల్గొన్నారు.

పేద రోగులకు అండగా ఉంటా


వైద్య శిబిరానికి హాజరైన రోగులు

సంజామల, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): పేద రోగులకు అండగా ఉంటానని గురు రాజా విద్యాసంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి అన్నారు. ఆదివారం మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కర్నూలు, నంద్యాల పట్టణాలకు చెందిన ప్రముఖ వైద్యులు గుండెజబ్బులు, బీపీ, షుగర్, కీళ్ల, దంత, చర్మ, ఊపిరితిత్తులు, స్త్రీ వ్యాధులు, ముక్కు, చెవి, గొంతు వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులతోపాటు సహాయకులకు ఉచిత భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ పేదలకు అండగా ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, మండలాలకు చెందిన గ్రామాల రోగులు, గురు రాఘవేంద్ర, గురు రాజా విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ ప్రమోద్

రుద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యూరియాను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. ఆదివారం రుద్రవరం గ్రామంలో నాలుగు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిష్టర్లును ఆయన పరిశీలించారు. యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ రఫి, ఏఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే రుద్రవరం పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ప్రమోద్ తనిఖీ చేశారు. సిబ్బందిని ఒక కేసు విషయంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

ప్యాపిలి : ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ మధుసూదన్ హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలో ని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణం సీజ్ చేస్తామని వ్యాపారులను హెచ్చరిం చారు. ఎమ్మార్పీ ధరల కే ఎరువులు విక్రయించాల న్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మేనే జరు శరణ్య పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని ఎరువుల దుకాణాల వ్యాపారులు యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజారెడ్డి హెచ్చరించారు. ఆదివారం వ్యవసాయ అధికారులతో కలిసి పట్ట ణంలోని మన గ్రోమోర్‌తో పాటు పలు ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో వ్యవసాయాధికారులు ఎంపీఈవో మధుబాబు, వీఏఏ భానుప్రకాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్యాపిలిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ, డీసీఎంఎస్ మేనేజరు

మోత్కలపల్లెలో అగ్ని ప్రమాదం

శిరివెళ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోత్కలపల్లె గ్రామంలో సుబ్బరాయుడు అనే వ్యక్తికి చెందిన గుడిసె ఆదివారం అగ్నికి ఆహుతైంది. జీవనోపాధి కోసం పెంచుకుంటున్న పొట్టేళ్లు అగ్నికీలకల్లో మృత్యువాతపడ్డాయి. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి, వీఆర్వో శివమల్లేశ్వరప్ప సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి నుంచి వివరాలు తెలుసుకు న్నారు. గుడిసె దగ్ధమై పొట్టేళ్లు మృతిచెందడంతో ఆర్థికంగా నష్టపోయానని.. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని బాధితుడు సుబ్బరాయుడు కోరారు.

విజేతలకు బహుమతులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని శిల్పా నేచర్ హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పార్కులో ఇసుకలో రన్నింగ్ పోటీలను నిర్వహించారు. రోటరీ ఆరోగ్య వ్యవస్థాపకులు డాక్టర్ రామగోపాల్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. విజేతలు రఘు, వీరేంద్రరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మాదురి, కావ్యశ్రీ, నాగమ్మ, ప్రమీలమ్మకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజ్ఞా కళాశాల డైరెక్టర్ హేమలతరెడ్డి, న ర్సింహారెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులం.. మేము మందుబాబులం

మందుబాబులం.. మేము మందుబాబులం.. మందుస్తే మాకు మేమే మహారాజులం.. అంటూ ఓ సినీ గేయం సాగిన తీరు ప్రస్తుతం రుద్రవరం మండల కేంద్రంలో కనిపించింది. ఆదివారం ఫుల్‌గా మద్యం తాగిన మందుబాబులు ఆదమరిచి రోడ్లపైనే పడకవేశారు. దీంతో వాహనదారులు రాక పోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే దీనికి బాధ్యులు ఎవరని పలువురు పట్టణ వాసులు ప్రశ్నించారు.

- రుద్రవరం, ఆంధ్రజ్యోతి


రుద్రవరం రహదారులపై మద్యం తాగి పడిపోయిన మందుబాబులు

అధ్యక్ష పీఠం ఎవరికో?

5వ పేజీ తరువాయి

అని అన్ని వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. నంద్యాల పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీల వాటిపై సమావేశంలో అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర కమిటీకి అందించ నున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

ప్రస్తుత అధ్యక్షుడిపై ఆరోపణలు?

ప్రస్తుతం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్‌పై టీడీపీ వర్గాల్లో పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జిల్లాలో రెడ్డి సామాజికవర్గం ఎక్కువ. ఎమ్మెల్యేలు కూడా ఈ సామాజికవర్గం వారే అధికం. ఈ నేపథ్యంలో ప్రస్తుత అధ్యక్షుడు బీసీ సామాజిక వర్గం కావడంతో అప్పట్లో టీడీపీ అధిష్ఠానం ఈయనకు అప్పగించింది. 2014-18లో వైసీపీ తరుపున జడ్పీటీసీగా గెలిచారు. టీడీపీ అధికారంలో ఉండటంతో పార్టీలో చేరి ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత కూటమి పాలనలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నియమించబడ్డారు. ఆయనది పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామం. కర్నూలు జిల్లాకు దగ్గరగా ఉంది. ఈయనకు టీడీపీ బోర్డు మెంబర్‌గా కూడా పార్టీ అవకాశం కల్పించింది. అయితే ఈయన అధ్యక్ష పదవి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నంద్యాలకు వచ్చిన దాఖలు తక్కువే అని ఆ పార్టీ వర్గాల్లో నెలకొంది. పైగా అధ్యక్షుడి స్థాయిలో ఒక్క సమావేశం కూడా విజయవంతం చేయలేదని పార్టీ నాయకుల్లో విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు కూడా ఈయనపై అసంతృప్తిగా ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో జిల్లా అధ్యక్షుడి ఎంపిక అభిప్రాయ సేకరణతో ఉత్కంఠ రేపుతోంది.

ఆశావహుల్లో ఉత్కంఠ

టీడీపీలో అధ్యక్ష పదవి డిమాండ్ కలిగిన పదవి. దీని కోసం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో పాటు డోన్‌కు చెందిన విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావు. నంద్యాల పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది రామచంద్ర రావు కూడా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఆయన గతంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. వీరితో పాటు ప్రస్తుత నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్య దర్శి మంత్రి కుమారుడైన ఎన్ఎండీ ఫిరోజ్ కూడా అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీ రెడ్డి సైతం అధ్యక్ష పదవికోసం ప్రయత్నిస్తు న్నారు. గోస్పాడు మండలం యాలూరుకి చెందిన టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుసేన్ కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా భూమా విఖ్యాత్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారని తెలిసింది.

ఎమ్మెల్యే, మంత్రులు, ఎంపీలు

జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీతో పాటు పలువురు ప్రధాన నాయకులు సైతం మంగళవారం జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష పదవితో పాటు పార్లమెంట్ , అనుబంధ కమిటీల ఎంపికకు సంబందించి అభిప్రాయ సేకరణ జరగనుంది.

వీరి మధ్యే పోటీ..

జిల్లా అధ్యక్ష పదవి కోసం జిల్లాలోని ఐదుగురు వ్యక్తుల మధ్య పోటీ ఎక్కువగా ఉందని ప్రచారం జిల్లాలో జోరందుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర విత్తనాభివృద్ది సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుసేన్, హైకోర్టు న్యాయవాది గోగుల నరసింహారావుల మధ్య పోటీ ఎక్కువగా ఉందని సమాచారం. వీరందరూ కూడా ఎవరి స్థాయిలో తమదైన శైలిలో అధ్యక్ష పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న ట్లు సమాచారం.

శిథిలావస్థలో పశువైద్యశాల


మద్దూరులో దెబ్బతిన్న పశువైద్య భవనం

చాగలమర్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు, చాగలమర్రి పశువైద్యశాల భవనాలు దెబ్బతిన్నాయి. పైకప్పు దెబ్బతిని కడ్డీలు బయటపడ్డాయి. దెబ్బతిన్న భవనంలోనే పశువైద్యులు, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. మద్దూరు వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పైకప్పు దెబ్బతింది. వర్షాలకు భవనం లోపల ఉన్న మందులు తడిచి దెబ్బతింటున్నాయి. కిటికీలు, వాకిళ్లు తప్పు పట్టాయి. గోడలు బీటలు వారి కూలేలా ఉన్నాయి. నూతన భవనాలు నిర్మించాలని అనేకసార్లు ఉన్నతాధికారులను కోరినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని సిబ్బంది, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న కిటికీలు, వాకిళ్లు

పాఠశాల మైదానం చదును


పాఠశాల ఆవరణలో చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

ప్యాపిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్ రాచెర్ల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు తమ వంతు సహకారం అందించారు. పాఠశాలలో దాదాపు 60 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆవరణం గుంతల మయంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. దీంతో గ్రామానికి చెందిన దివాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గ్రామంలోని ట్రాక్టర్ యజమానుల ఆధ్వర్యంలో రూ.50వేలు వసూళ్లు చేసి పాఠశాల ఆవరణలోని గుంతలను పూడ్చారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం


మాట్లాడుతున్న సుదర్శనం

బనగానపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మర్చంట్ భవనంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శనం అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో నూతన కమిటీ చీఫ్ అడ్వయిజర్‌గా మద్దయ్య, డిపో అధ్యక్షుడిగా జంబులయ్య, కార్యదర్శిగా సీ. శ్రీనివాసులు, గ్యారేజ్ కార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి, గ్యారేజీ అధ్యక్షుడిగా గఫూర్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీ.మద్దిలేటి, కార్యవర్గ సభ్యురాలు భద్రావతి, జోనల్ కార్యదర్శి చె న్నారెడ్డి జిల్లా చైర్మన్ కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి శివరాం, జిల్లా ఉ పాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి


- పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్

డోన్ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఆయన కూటమి ప్రభుత్వానికి కోరారు. అనంతరం సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డికి మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు సుబ్బరాయుడు, గాలయ్య, దాసప్ప, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ అమావాస్య పూజలు

చాగలమర్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె, శెట్టివీడు, చాగలమర్రి గ్రామాల్లో వెలసిన అభయాంజనేయ, వీరాంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం శ్రావణ అమావాస్య పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల కమి టీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో రవికుమార్ ప్రతిభ



చాగలమర్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో ఆర్సీఎం పాఠశాలకు చెందిన విద్యార్థి జెట్టి రవి కుమార్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 37వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. చాగలమర్రి మం డల పరిధిలోని ఇడమడకకు చెందిన వెంకట రమణ, లక్ష్మీనర్సమ్మ దంపతుల రెండవ సంతానం జెట్టి రవికుమార్. వీరిది వ్యవసాయ కుటుంబం. ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం

చాగలమర్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరంలాంటిదని, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్-6 పథకాలను అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలుపుకున్నారన్నారు. నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, పిచ్చయ్య, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

పేట్నీకోటలో ఘర్షణ

కొలిమిగుండ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేట్నీకోట గ్రామంలో నారాబోయిన మధుపై దాడి చేసిన ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. స్థలం విషయంలో మధు, మల్లికార్జున, సంజన్న అనే వ్యక్తులు ఘర్షణ పడి, మధుపై మల్లికార్జున, సంజన్న దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.